క్లుప్తంగా

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు : ఈనెల 15వ తేదీ నుంచి వారం రోజులపాటు బ్యూటీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్నేహ సేవా సమితి అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రెండు గంటలపాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్‌నంబర్ 98853 39306కు సంప్రదించాలని కోరారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తిరువెంగళాపురం పంచాయతీలోని ఎత్తిరాజుపల్లెలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అనంతరం ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ క్రిష్ణారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, పంచాయతీ సెక్రటరీ తిమ్మయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవాంగ కల్యాణ మండప కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయకనగర్‌లోని దేవాంగకళ్యాణ మండప కమిటీ అధ్యక్షుడు పదవి మినహా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కల్యాణ మండప కమిటీ శాశ్వత గౌరవాధ్యక్షుడు వుట్టి నాగశయనం, అధ్యక్షుడు పుచ్చగింజల రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా మచ్చా వెంకట సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా దేవరశెట్టి ఆదినారాయణ, జొన్నమునిస్వామి, కోశాధికారి కొంపల వెంకటాచలపతి, ఉపకోశాధికారి గిద్దలూరు మల్లిఖార్జున, సహాయ కార్యదర్శులుగా వేమిశెట్టి నాగరాజు, గొదెన కృష్ణకుమార్, డైరెక్టర్లుగా బత్తల వెంకట సుబ్బయ్య, నున్న రామకృష్ణ, మచ్చా రామాంజనేయులు, మచ్చా బాబు, వెంకటశశిధర్, పద్మనాభం, వెంకట్రామయ్యలు ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి రెడ్డిచంద్రశేఖర సుబ్రహ్మణ్యం, పోసా.వెంకటలక్షుమయ్యలు ఇద్దరు పోటీ పడుతున్నారన్నారు. ఈ నెల 22న అధ్యక్ష పదవికి ఎన్నిక జరుగనుందని వారు తెలిపారు.

అభినందనలు

మైదుకూరు : వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మైదుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల హెడ్ మాస్టర్ ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

దువ్వూరు: మండలంలో ఉపాధి హామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. దువ్వూరు పంచాయతీలో జరిగే రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెంకుపల్లె, మూడిండ్లపల్లె పంచాయతీలోని తైవాన్ జామ తోట, నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మైథిలి, ఏపీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులకు మఠం ముస్తాబు

- రేపు ఉత్సవాలు ప్రారంభం
- 11 రోజుల పాటు నిర్వహణ
- వైభవంగా శమీ పూజోత్సవం



జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి



జగన్మాత శ్రీఈశ్వరీదేవి అమ్మవారు



శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం



బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠం

బ్రహ్మంగారిమఠం : దేవీ శరన్నవరాత్రులకు బ్రహ్మంగారిమఠం ముస్తాబవుతోంది. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠం, శ్రీ జగన్మాత ఈశ్వరీదేవిమఠంలలో ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. అలాగే ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానాలు, ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 15వ తేదీ నుంచి 25 వరకు 11 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. భారీగా తరలివచ్చే భక్తుల కోసం వసతులు కల్పిస్తున్నారు. ముఖ్యంగా శమీపూజోత్సవం కనుల పండువగా జరుగుతుంది. శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములు, వారి మనువరాలైన శ్రీ ఈశ్వరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను మఠాల నుంచి జమ్మిచెట్టు వరకు ఊరేగింపు చేసి, విశేష పూజలు చేస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో..

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రోజూ వేదపండితులు ప్రత్యేక పూజలు చేస్తారు. 15న దేవీసప్తశతి పారాయణం, శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం, రాత్రి కలశ స్థాపనం, ప్రథమ అఖండ స్థాపనం, ద్వారపూజ కలశోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న ఉదయం ప్రభాతసేవ, రాత్రి ద్వితీయ అఖండ స్థాపనం, 17న ఉదయం ప్రభాతసేవ, రాత్రి తృతీయ అఖండ స్థాపనం, 18న ఉదయం ప్రభాతసేవ, రాత్రి చతుర్థ అఖండ స్థాపనం, 19న ఉదయం ప్రభాతసేవ, రాత్రి పంచమ అఖండ స్థాపనం తదితరాలు చేపడుతారు. 20న ఉదయం ప్రభాతసేవ పారాయణం, రాత్రి షష్ఠమ అఖండ స్థాపనం, 21న ఉదయం ప్రభాతసేవ, పగలు ద్వారపూజ, రాత్రి సప్తమ అఖండ స్థాపనం, కలశోత్సవం, 22న దుర్గాష్టమి రోజున ఉదయం ప్రభాతసేవ, రాత్రి అష్టమ అఖండ స్థాపనం, 23న ఉదయం ప్రభాతసేవ, రాత్రి సంపూర్ణ నవమి అఖండ స్థాపనం ఉంటాయి. 24న విజయ దశమిని పురస్కరించుకుని ఉదయం ప్రభాత సేవ, సాయంత్రం శమీపూజోత్సవం, రాత్రి కలశోత్సవం, 25న మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం, అఖండ ఉద్వాసనం, రాత్రి ఆయుధపూజ, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రసామి కృపకు పాత్రులు కావాలని మఠం ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య కోరారు.

శ్రీ ఈశ్వరీదేవి మఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీ ఈశ్వరీదేవి అమ్మవారు నవరాత్రులలో ఒక్కో రోజు ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారు. 15న ఉదయం గణపతి పూజ, సాయంత్రం దీక్షా కలశ స్థాపన, రాత్రి కలశోత్సవం కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 16న అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిగా, 17న గాయత్రిదేవి, 18న అన్నపూర్ణదేవి, 19న శ్రీ లలితాదేవి, 20న శ్రీ మహాలక్ష్మీదేవి, 21న సరస్వతీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులను ఆశీర్వదిస్తారు. 24న విజయదశమి రోజున శమీ ఉత్సవం నిర్వహిస్తారు. 25న మహాప్రసాద వినియోగం, ఆయుధపూజ, బలిహరణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాల్లో రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం ప్రభాతసేవ, నాదనీరాజనం, శ్రీచక్రార్చన, అభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం కలశతీర్థం, అభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం నవరాత్ర అఖండ స్థాపనం, ప్రసాద వినియోగం తదితరాలు చేపడుతారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ ఈఓ బి.వి.జగన్ మోహన్‌రెడ్డి కోరారు.

16న చాపాడులో సీఎం జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ఈ నెల 16న చాపాడు సమీపంలోని వైఎస్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరు కానున్న ఈ కార్యక్రమానికి గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మండలంలోని రైతులు వైఎస్సార్ రైతు భరోసా కోసం ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మిప్రసన్న తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు, కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు, భార్యాభర్తల్లో ఎవరు చనిపోయినా వారి నామినీలు వెంటనే రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో, మండల వ్యవసాయ కార్యాలయాల్లో వివరాలను తెలిపి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

కాశినాయన : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించనున్న బస్‌షెల్టర్‌కు వారు భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించారు. హనుమంతరెడ్డి, రమణారెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న పీఆర్ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. నాడు దివంగత మహానేత ఆరోగ్యశ్రీ, 108 సేవలు తీసుకువస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రుల ఆధునీకరణ, ప్రతి పంచాయతీలో హెల్త్‌క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రికి సంబంధించి కొన్ని డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలుసుకున్న ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి త్వరలోనే ఖాళీలు భర్తీ చేసేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలి

మైదుకూరు : ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం మైదుకూరులో జరిగిన మేరీ మట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మైదుకూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో సేకరించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఏపీ రమణారెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని 'అమృత కలశం' యాత్ర పేరుతో దేశ రాజధాని ఢిల్లీకి పంపుతామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజి, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఎన్‌సీసీ, స్కౌట్ బ్యాండ్‌తో మట్టి నింపిన అమృత కలశాన్ని మైదుకూరు ప్రధాన రహదారులలో ఉత్సవంగా ఊరేగించారు. రాయల కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌వైకే ప్రతినిధి వాగ్దాడం శివశంకర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉమ్మడి శెట్టి సతీష్‌బాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జూదరహిత ప్రొద్దుటూరు చేయాలన్నదే లక్ష్యం

- ఎస్పీని కలిసిన తర్వాత ర్యాలీ నిర్వహిస్తాం
- ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జూదరహిత ప్రొద్దుటూరు చేయాలని తాను సంకల్పం తీసుకున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైరపర్సన్ ఛాంబర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూదం అనాదిగా అన్ని ఊర్లలో కొనసాగుతోందన్నారు. అదే తరహాలో కొద్దో గొప్పో ప్రొద్దుటూరులో కూడా జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా ఉన్నాయని తెలిపారు. 60–70 ఏళ్లుగా మట్కా నడుస్తోందని, పాతికేళ్లుగా క్రికెట్‌బెట్టింగ్ కొనసాగుతోంది, పదేళ్లుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోందన్నారు. గతంలో చాలా మంది అధికారులు తమ వంతు బాధ్యతగా పనిచేసినా పూర్తిగా వీటిని అరికట్టలేకపోయారన్నారు. ఇందుకు కారణంగా గత పాలకులు, ప్రభుత్వాలేనని తెలిపారు. గతంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీతో పాటు 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం, నాటి ప్రజా ప్రతినిధులు ఈ దిశగా కృషి చేయలేదన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రొద్దుటూరును జూదరహిత ప్రొద్దుటూరుగా చేయాలని తాను గట్టి నిర్ణయాన్ని తీసుకున్నానన్నారు. ఇందులో భాగంగా కొత్తగా వచ్చిన ఎస్పీకి నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలసి విన్నవిస్తామన్నారు. తర్వాత ప్రొద్దుటూరులో జూదరహిత ప్రొద్దుటూరు కోరుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఏ పరిస్థితుల్లోనూ అసాంఘిక కార్యకలాపాలకు తాను మద్దతు ఇవ్వనని చెప్పారు. ఎక్కువ మంది పేద, మధ్యతరగతి ప్రజలే అసాంఘిక కార్యకలాపాలకు బలవుతున్నారన్నారు. సంఘాన్ని సంస్కరించాలనే ఆశయం ఉన్న మహిళలతోపాటు మేధావులు, విద్యావంతులు తన సంకల్పానికి మద్దతు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు.

సంక్షేమం, ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం



ఖాజీపేట : వృద్ధురాలికి అద్దాలను పెడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. తవ్వారిపల్లె గ్రామంలో జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. వైద్య సేవలపై ఆరాతీశారు. మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిపాలనతోపాటు ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం జగనన్న సురక్షా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, తవ్వారిపల్లె నాయకుడు తవ్వా అమరేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాఘవరెడ్డి, మరళీమోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా పేదల ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లెలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యం అందిస్తున్న వైద్యులతో వైద్యం చేయించుకుంటున్న ప్రజలతో మాట్లాడారు. శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీటీసీ రమాదేవి, అజమతుల్లా, రామోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దారు యామిని, వైద్యాధికారులు ఓబులేసు, కావ్య, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, ఎంపీహెచ్ఈఓ రాఘవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్, ఎంపీడీఓ జగదీశ్వర రెడ్డి, డాక్టర్లు సురేష్‌బాబు, వికసిత, రోహిణి, స్పెషలిస్టు డాక్టర్లు వర్షిణి, కాంచనమాల, సర్పంచ్ చెంద్రారాయుడు, ఎంపీటీసీ రఘు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : మండలంలోని చిన్నయరసాల సచివాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక వైద్యులు, వైద్యాధికారులు విష్ణువర్ధన్, సందీప్, శ్రీవిద్య, సాయితేజలు రోగులందరినీ పరీక్షించి మందులు ఇచ్చారు. శిబిరంలో 3 వందల మందికి పైగా రోగులకు వైద్య సేవలందించారు. జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ కె.రమణారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, యువజన నాయకుడు గిరిప్రణీత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ నాయకులు, మండల అధికారులు, ఆరోగ్యశ్రీ ఆరోగ్యమిత్ర శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడులోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మండల అధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఈ వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, స్థానిక సర్పంచ్ నాగలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద, మధ్యతరగతి వర్గాలకు వరం లాంటిదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీపీయంఓ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న గోపవరం పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ నజీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 443 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు కేజే రఘురామిరెడ్డి, శ్రీనివాస్, ఇళయరాణి, షేక్ జరీనా, హుస్సేన్‌బాషా వైద్య సేవలు అందించారు. సర్పంచ్ గద్దె మోషె, ఉపసర్పంచ్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : ప్రజలందరికీ మంచి ఆరోగ్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి అన్నారు. మండలంలోని వెల్లాల గ్రామంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులను వైద్యులు మంజుల, నిఖిల, నజీర్ పరీక్షించారు. సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణమ్మ, ప్రభాకర్ తదితరులు మందులను అందజేశారు.

గోపవరంలో..

గోపవరం : మండలంలోని కాలువపల్లెలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వలంటీర్లు, వైద్యసిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి వివిధ వ్యాధులు ఉన్న వారిని గుర్తించారు. వారందరికి కూడా వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో, మండలంలోని ఖాదర్‌బాద్, నంగనూరుపల్లె సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ బీమా నిధులను వినియోగించుకోండి



బీమా మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

చాపాడు : ప్రభుత్వం అందించే వైఎస్సార్ బీమా నిధులను కుటుంబ అవసరాల కోసం వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాయపల్లెకు చెందిన నూర్జహాన్ అనే మహిళ భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 5లక్షల వైఎస్సార్ బీమా మంజూరు పత్రాన్ని శుక్రవారం బాధితురాలికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రమాదాలు, కారణాలతో మరణించిన, గాయపడిన వారికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా ద్వారా ఆదుకుంటుందన్నారు. దీని ద్వారా వచ్చే డబ్బును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న మహాలక్ష్మి సమేత చెన్నకేశవాలయం కమిటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం దసరా ఉత్సవాల ప్రారంభ సందర్భంగా మహిళలతో శివాలయం నుంచి కలశాల ఊరేగింపు ఉంటుందన్నారు. ఆదివారం రాజరాజేశ్వరిదేవి, సోమవారం భవానిదేవి, మంగళవారం అన్నపూర్ణాదేవి, బుధవారం ధనలక్ష్మి, గురువారం శ్రీదేవి వనవిహారిని, శుక్రవారం సరస్వతి, శనివారం లక్ష్మివేంకటేశ్వరస్వామి, 22న మహిషాసురమర్దిని, 23న విజయలలితాదేవి రూపంలో అమ్మవారిని అలంకరిస్తారన్నారు.

మహాలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో...

పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఉత్సవాలను సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో స్పెషల్ కలకత్తా సెటింగ్ ఏర్పాటు చేశామని, శివశంకర్ సప్లయర్స్ లక్ష్మినారాయణరెడ్డి కుమారులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్‌రెడ్డిలు పందిరి సెట్టింగ్‌లను ఉచితంగా ఏర్పాటు చేశారన్నారు. 15న ఆదిలక్ష్మిదేవి, 16న ధ్యాన్యలక్ష్మి, 17న ధైర్యలక్ష్మి, 18న సంతానలక్ష్మి, 19న మోహినీ వనవిహారిని, 20న సరస్వతీదేవి, 21న ధనలక్ష్మిదేవి, 22న కళింగ మర్దిని అలంకారం చేస్తున్నామన్నారు. 23న బెంగుళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక రథంలో విజయలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారి శమీదర్శనం ఉంటుందన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

పోరుమామిళ్ల : స్థానిక అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం నుంచి 25వ తేదీవరకు జరుగుతాయని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గాజులపల్లె శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం 5 గంటల నుంచి సుప్రభాతసేవతో పూజాకార్యక్రమాలు మొదలవుతాయని, ప్రతి రోజు రాత్రి దేవీ అలంకారాలు ఉంటాయన్నారు.

